క్లుప్తంగా

చిన్న శేషవాహనంపై దేవదేవుడు



చిన్నశేష వాహనంపై స్వామి వారు

జమ్మలమడుగు : నారాపురస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి చిన్నశేష వాహనంపై పురవీధులలో ఊరేగింపు చేశారు. బుధవారం ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి చిన్నశేష వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు దేవదేవుడు తమ ఇంటి వద్దకు వచ్చాడంటూ భక్తులు నిండు బిందెలు కలిగిన నీటితో స్వామి వారి ముందు పోసి పూజలను నిర్వహించారు. సాయంత్రం హంస వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకోవటానికి ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ



బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వస్తున్న మహిళలు

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలనులో వెలసిన శ్రీ మారెమ్మతల్లి 9వ వార్షికోత్సవం పురస్కరించుకుని బుధవారం గ్రామ సుభిక్షం కోసం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధల నడుమ బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చీరసార నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ బోనాలను మహిళలు గ్రామంలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించారు.

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సినీనటి



వెంకటేశ్వరస్వామి ఆలయంలో సినీనటి సుమయరెడ్డి

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన వెంకటేశ్వర స్వామిని బుధవారం డియర్ ఉమా సినిమా హీరోయిన్, నిర్మాత సుమయరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె పేరు మీద ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు.

అడల్ట్ వాక్సిన్ పూర్తి చేయాలి



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారి ఉమామహేశ్వరరావు

వేంపల్లె : ఆయా సచివాలయాల పరిధిలో నిర్దేశించిన అడల్ట్‌బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం, అలాగే పాత గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు స్వాతిసాయి, సీహెచ్‌ఓలు మునిరెడ్డి, వెంకటరత్నం, సూపర్‌వైజర్ ఫక్రుద్దీన్, అరుణాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ సమ్మర్ క్యాంపు



స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : ప్రభుత్వ గ్రంథాలయశాఖ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. బుధవారం గ్రంథాలయంలో వచ్చిన పిల్లకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ అందించామని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు. సుమారు 27 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు జగన్నాథం, పాఠకులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం

ప్రొబిషనరి డీఎస్పీ శ్రీకాంత్



జమ్మలమడుగులో డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



వేంపల్లె : కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు : పట్టణంలో రాజకీయ పార్టీల నాయకులు దౌర్జన్యాలకు పాల్పడితే తాము ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొవటానికి సిద్ధంగా ఉన్నామని ప్రొబిషనరి డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో మాక్ డ్రిల్ పోలీసు బలగాలతో నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ తర్వాత పట్టణంలో ఎలాంటి గొడవలు జరిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లు, గ్రామంలో సమస్యలు సృష్టించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. తాము లాఠీ చార్జీతో పాటు, కాల్పులు చేయటానికి కూడా వెనుకాడబోమని హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం పట్టణంలో పోలీసు బలగాలతో మార్చ్‌ఫాస్టు నిర్వహించారు.

గంట సేపు అయోమయంలో ప్రజలు..

ఉన్న ఫలంగా పట్టణంలోని పాతబస్టాండ్‌లో పోలీసు బలగాలు భారీగా వచ్చి చేరడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఆర్టీసీ బస్సులను పాత బస్టాండ్‌కు రాకుండా ఆర్టీసీ బస్టాండ్‌కు పరిమితం చేయడంతోపాటు వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డు నుంచి పంపిస్తుండటంతో పట్టణంలో ఎమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పాత బస్టాండ్‌లో పోలీసులు ప్రత్యేక బలగాలతో డ్రిల్ చేస్తున్నారని తెలుసుకున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆనంద్, సీఐలు కరుణాకర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్

వేంపల్లె : ప్రజల భద్రత కోసమే సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు వేంపల్లె సీఐ చాంద్‌బాషా తెలిపారు. బుధవారం రామిరెడ్డిపల్లి, కత్తులూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే గ్రామ బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదలతో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తిరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని కడప రూరల్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో బుధవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత ఏపార్టీ గెలిచిన టపాసులు పేల్చడం, ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. ఎవరైన అలా చేసి గొడవలు సృష్టిస్తే అటు వంటి వారిపై కఠిన చర్యలతో పాటు గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

చెన్నూరులో నాకాబందీ

చెన్నూరు : జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు బుధవారం చెన్నూరులో సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది లక్ష్మీ నగర్, సరస్వతి నగర్, రాజుల కాలనీలోని అనుమానితులైన వారి ఇళ్లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి వ్యవహరించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని చిన్నమాచుపల్లె, కడప-కర్నూలు జాతీయ రహదారిలో వాహనాల తనిఖీలు చేపట్టారు.

మాలెపాడులో నాకాబందీ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో కొండాపురం సీఐ వేణుగోపాల్, కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోలీస్ కవాత్ నిర్వహించి ఇరు వర్గాల ఇళ్లు, కళాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.



చెన్నూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ పార్థసారథి



మాలెపాడు గ్రామంలో నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు



పాతసంగటిపల్లెలో గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజు

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

200 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరు



వేరుశనగ కాయల కోసం పేరు నమోదు చేసుకుంటున్న రైతులు

పులివెందుల రూరల్ : పులివెందుల మండలానికి సంబంధించి 200 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరైనట్లు వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పాస్ బుక్ జిరాక్స్ తీసుకుని రైతుభరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒక ఎకరాకు ఒక్కో రైతుకు ఒక ప్యాకెట్, రెండు ఎకరాలకు రెండు ప్యాకెట్లు, 5 ఎకరాలలోపు ఉన్న వారికి ఎకరాకు ఒక్కో ప్యాకెట్ చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

ముద్దనూరు : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై పంపిణీ చేయడానికి వేరుశనగ విత్తనకాయలు అందుబాటులో వున్నాయని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. మండలానికి 80 క్వింటాళ్ళ వేరుశనగ విత్తనాలు మంజూరయ్యాయని, వేరుశనగ సాగుచేసే రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ప్రతి రైతుకు గరిష్టంగా 3 బస్తాలు అంటే 90 కిలోలు అందిస్తామని ఏవో తెలిపారు. 40 శాతం రాయితీతో అందించే ఈ వేరుశనగ విత్తనాలు కావాలసిన రైతులకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అనంతరం విత్తనాలు పంపిణీ చేస్తామని ఏవో తెలిపారు.

వేరుశనగ విత్తన కాయలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

వేముల : ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న విత్తన కాయల కోసం ఆయా రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. మండలానికి 400 క్వింటాళ్లు కె6 అనే రకం విత్తనాలు, 300 క్వింటాళ్లు నారాయణ అనే రకం విత్తనాలు మంజూరయ్యాయన్నారు. కె6 రకం 30కేజీల ప్యాకెట్ ధర రూ.1710లు చెల్లించాల్సి ఉంటుందని, నారాయణ రకం 30కేజీల ప్యాకెట్ ధర రూ.1740 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రైతుకు 3 ప్యాకెట్ల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా రైతు భరోసా కేంద్ర పరిధిలోని రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే విత్తనకాయలు తీసుకునేందుకు వీలుంటుందన్నారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చీనీ టన్ను ధర రూ.39 వేలు



పులివెందులలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న చీనీకాయలు

పులివెందుల రూరల్ : వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు పండించిన చీనీకాయలను తరలించి అక్కడ మార్కెట్‌యార్డు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తారు. వేలంపాటలో మొదటి ధర రకం రూ.39 వేలు, మధ్యరకం కాయలు రూ.27 వేలు ధర పలికిందని రైతులు అంటున్నారు. మార్కెట్‌యార్డు లేనప్పుడు 10 టన్నులకు 2 టన్నులు వ్యాపారస్తులకు సూట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని రైతులు అంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో పులివెందులలో చీనీకాయల కొనుగోలు మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. చీనీకాయల మార్కెట్‌లో సూట్ లేకుండా పండించిన పంటలను అమ్ముకుని డబ్బులు తీసుకుంటున్నట్లు రైతులు అంటున్నారు. తోటల్లో చీనీ కాయలు తక్కువ ఉంటే వ్యాపారస్తులు వచ్చేవారు కాదని, వచ్చినప్పటికీ ఇష్టమొచ్చిన విధంగా ధరలు అడిగేవారని గత్యంతరం లేక ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని రైతన్నలు అంటున్నారు. ప్రస్తుతం రైతులు కాయలు తక్కువ ఉన్నప్పటికీ ట్రాక్టర్లు, ఆటోలలో చీనీకాయలను మార్కెట్‌కు తీసుకువచ్చి సూట్ లేకుండా అమ్ముకుని డబ్బులు చేతపట్టుకుని వెళ్తున్నారు.

దివ్యాంగ చిన్నారుల పాఠశాలలో నమోదుపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న భవిత కేంద్రం ఐఈఆర్టీలు యశోద, తదితరులు

వేంపల్లె : సాధారణ పిల్లలతో సమానంగా దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో నమోదు కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష కో ఆర్డినేటర్ కేశవరెడ్డి తెలిపారు. బుధవారం భవిత కేంద్రం ఐఈఆర్టీలు యశోద, సుజాతలు మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, ఆశాకార్యకర్తలను సంప్రదించి వివరాలు సేకరించారు. మే 1 నుంచి జూన్ 9 వరకు దాదాపు 40 రోజుల పాటు దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో నమోదుపై సర్వే కొనసాగుతుందని ఎంఈఓ-1 జాఫర్ సాదీక్ వెల్లడించారు. అలాగే కొందరు అవగాహన లేని కారణంగా ఇంటి వద్దే దివ్యాంగ చిన్నారులను ఉంచుకున్నారని, వారిని గుర్తించి సమగ్ర శిక్ష ద్వారా అందుతున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించాలని ఎంఈఓ-2 స్టాలిన్ ఐజాక్ సూచించారు. భవిత దివ్యాంగుల కేంద్రం ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు ఉన్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి



హన్‌మత్ వాహన సేవలో లక్ష్మీనసింహస్వామి



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేదపారాయణం, మహామంగళహారతి, రాత్రి హన్‌మత్ వాహన సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొన్నెర్లల్లో స్నానాలు అచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ

నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఉంజల్‌సేవ, రాత్రికి గరుడసేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : స్థానిక ముద్దనూరు రోడ్డులోని వాసవి కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రంను పురస్కరించుకుని ఉదయం ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోయుక్తంగా మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు మొలకల పౌర్ణమి



లింగాలలోని మొలకల కుంపట్లు

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం మొలకల పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. అమావాస్య రోజు నుంచి మహిళలు నవధాన్యాలను సేకరించి ఆవుపేడతో కుంపట్లను నింపి కుంపట్లలో నవధాన్యాలను పోస్తారు. ఆరోజు నుంచి ప్రతీరోజు సాయంత్రం కుంపట్ల వద్ద మహిళలు గౌరమ్మ పాటలు పాడుతూ పూజలు నిర్వహిస్తారు.

నవధాన్యాలలో ఏ ధాన్యం బాగా ఏపుగా పెరుగుతుందో ఆ ధాన్యపు పంట బాగా పండుతుందని ఇక్కడి ప్రజల ప్రగాఢ నమ్మకం. గురువారం పౌర్ణమి రోజు సాయంత్రం డప్పులు, మేళాలతో కుంపట్లను ఊరేగింపుగా తీసుకెళ్లి ఊరుబావులు, దేవాలయాల వద్ద వాటిని నెలకొలుపుతారు. అదేరోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో గౌరమ్మ కుంపటిని ఏర్పాటు చేసి ముత్తైదువులు గౌరమ్మ పాటలు పాడుతూ గౌరమ్మ కుంపటిని ఊరేగింపు నిర్వహిస్తారు. గురువారం మధ్యాహ్నం నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొలకల పౌర్ణమి నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది.

శేష వాహనంపై మోక్ష నారాయణుడి ఊరేగింపు



శేష వాహనంపై శ్రీ మోక్షనారాయణస్వామి ఊరేగింపు

కమలాపురం : మండల పరిధిలోని శ్రీ రామాపురం పుణ్యక్షేత్రంలో శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, సంజీవిని సహిత శ్రీ వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన బుధవారం సాయంత్రం శేష వాహనంపై కొలువుదీరిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ మాడ వీధుల్లో మేళతాళాలతో, భాజా భజంత్రీలతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి వార్లకు అరుణ పారాయణం, అర్చనలు, రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ హోమాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.


నేటి నుంచి విత్తన నమోదు ప్రక్రియ ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి వేరుశనగ విత్తన ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి 250 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం మంజూరయిందన్నారు. ఈ విత్తనాన్ని ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తోందని కావాల్సిన రైతులు మీ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోను తీసుకుని గ్రామంలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. కె 6 మరియు టి.సి.జి.ఎస్ 1694 రకం క్వింటాళ పూర్తి ధర రూ.9500 కాగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పోను రూ.5700 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కదిరి లేపాక్షి రకం క్వింటాళ్ పూర్తి ధర రూ.8700 కాగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పోను రూ.5220 రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్ధ ఎకరా భూమి ఉన్న రైతుకు 30 కేజీల సంచి 1, అర్ధ ఎకరం నుంచి ఎకరా ఉన్న రైతుకు 30 కేజీల సంచులు 2, ఎకరా కన్నా ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతుకు 30 కేజీల సంచులు 3 ఇవ్వనున్నట్లు తెలిపారు. వేరుశనగ పంట సాగు చేయు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆ బీఈడీ కళాశాలకు వైవీయూ గుర్తింపు లేదు

వైవీయూ : జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీ మలయాళస్వామి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ)కు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేటి వరకు యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి గుర్తింపు (అఫిలియేషన్) లేదని విశ్వవిద్యాలయ కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె. రఘుబాబు ఒక ప్రకటన బుధవారం విడుదల చేశారు. సదరు కళాశాలలో బీఈడీ ప్రవేశాలు పొందే విద్యార్థులకు విశ్వవిద్యాలయం ఎలాంటి బాధ్యత వహించదని స్పష్టం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. భవిష్యత్తులో న్యాయస్థానాల మార్గదర్శకం మేరకు విశ్వవిద్యాలయ నిర్ణయాన్ని తెలియజేస్తామన్నారు.

సినీ సాహిత్యం ఉన్నతిని పెంచిన ‘వేటూరి’



వేటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తదితరులు

కడప కల్చరల్ : తెలుగు సినీ గీతాల ప్రముఖ రచయిత వేటూరి సుందర రామమూర్తి సినీ సాహిత్యపు ఉన్నతిని గణనీయంగా పెంచారని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం వేటూరి వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా రచయితల సంఘం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య మూల మాట్లాడుతూ వేటూరి సినీ గీతాల్లో కూడా విశిష్టమైన కవిత్వాన్ని పండించి తెలుగు సినీ పాటలకు జాతీయ స్థాయిలో ఖ్యాతిని సంతరించి పెట్టారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థలం నటులు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేటూరి పాటలకు ప్రత్యేక ఒరవడి కనిపిస్తుందన్నారు.

జీవ వైవిధ్యం.. మానవాళి మనుగడకు వరం

కడప కల్చరల్ : ప్రకృతిలోని జీవ వైవిధ్యం మానవాళి మనుగడకు వరం లాంటిదని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు పి.వెంకటేశ్వర్లు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం ఆర్కే నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నగర కమిటీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతిలో వైవిధ్య భరితమైన ప్రాణులు మనుగడ సాగిస్తున్నాయని, మానవాళితో కలిసి వాటి జీవన క్రమమే వైవిధ్యమని తెలిపారు. వాతావరణ కాలుష్యం కారణంగా ఎన్నో రకాల జీవజాతులు నశించిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. జేవీవీ జిల్లా కోశాధికారి సమీర్‌బాష, నగర ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.